

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

బుధవారం

25 నవంబర్ 2026



వాహనదారుల కష్టాలు

స్పందించిన ఎస్సై..రంగంలోకి జేసీబీ

- గుంతలమయమైన రహదారికి తాత్కాలిక మరమ్మతులు ప్రారంభం
- కోహిర్ నుంచి చౌరస్తా వరకు గుంతల పూడ్చివేత పనులు
- ఎస్సై నరేష్ చొరవపై హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



కోహిర్, నవంబర్ 24 (జనంసాక్షి): సమస్య చిన్నదైనా.. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుంటే స్పందించాల్సిందేనన్న ఆలోచనతో కోహిర్ ఎస్సై నరేష్ ముందడుగు వేశారు. నిత్యం వాహనదారులు ప్రయాణించే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను గమనించి, వాటి వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుర్తించి తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు. జేసీబీ యంత్రాన్ని రంగంలోకి దించి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చే పనులు ప్రారంభించడంతో వాహనదారులకు కొంత ఊరట లభించింది.

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల కేంద్రం నుంచి కోహిర్ చౌరస్తా వరకు ఉన్న రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించుకునే క్రమంలో వాహనాలపై నియంత్రణ కోల్పోయే ప్రమాదం నెలకొంది. రాత్రి సమయాల్లో గుంతలు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ పరిస్థితిని గుర్తించిన ఎస్సై నరేష్ ప్రత్యేక చొరవ తీసుకొని జేసీబీ సహాయంతో రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. రహదారిపై దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి గుంతల్లో కంకర మిశ్రమాన్ని వేసి పూడ్చే పనులు ప్రారంభించారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా, గుంతల కారణంగా ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది.

సాధారణంగా రహదారుల మరమ్మతులు సంబంధిత శాఖల బాధ్యత అయినప్పటికీ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని పోలీసు అధికారి స్వయంగా చొరవ చూపడం స్థానికుల దృష్టిని ఆకర్షించింది. ప్రజలకు ఎదురయ్యే సమస్యలను గుర్తించి సంబంధిత పరిష్కార చర్యలకు ముందుకు రావడం పట్ల పలువురు వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శాశ్వత మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి...

ప్రస్తుతం చేపట్టిన గుంతల పూడ్చివేత పనులతో తాత్కాలికంగా ఉపశమనం కలిగే అవకాశం ఉన్నప్పటికీ, రహదారిపై పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత రహదారి శాఖ అధికారులు స్పందించి రహదారి నాణ్యతను మెరుగుపరిచి, భవిష్యత్తులో మళ్లీ గుంతలు ఏర్పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి స్పందించిన ఎస్సై నరేష్ చొరవ ప్రస్తుతం కోహిర్ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

ఆత్మకూర్‌లో పోలీసుల

ముమ్మర తనిఖీలు.. డాగ్ స్క్వాడ్ తో విస్తృత సోదాలు



ఆత్మకూర్, నవంబర్ 24 (జనంసాక్షి): వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణంలోని బస్టాండ్, ఇరానీ కేఫ్, హోటళ్లు తదితర రద్దీ ప్రాంతాల్లో పోలీసులు మంగళవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు.ఎస్ఐ జయన్న ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ తో కలిసి ఈ తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు, వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఎస్ఐ జయన్న మాట్లాడుతూ.. ప్రజల భద్రతే తమ మొదటి ప్రాధాన్యమని అన్నారు. బస్టాండ్, మార్కెట్ వంటి రద్దీ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అపరిచిత వ్యక్తుల నుంచి ఎలాంటి వస్తువులు తీసుకోవద్దని సూచించారు.బస్టాండ్ లో ప్రయాణికుల బ్యాగులు, వేచి ఉండే ప్రాంతాల్లో, హోటళ్లు, కేఫ్ లలో అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించి, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాల గుర్తింపు కోసం డాగ్ స్క్వాడ్ తో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. షాపుల ముందు అపరిచిత వాహనాలు, బ్యాగులు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. తనిఖీల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని పోలీసులు తెలిపారు.

రైతుల నమ్మకమే మా బలం..సేవే మా లక్ష్యం!

- రైతుల ఆశలకు కొత్త భరోసా..పీఏసీఎస్‌కు కొత్త నాయకత్వం
- కల్వకుర్తి పీఏసీఎస్ చైర్మన్‌గా శ్రీపురం హరీశ్వర్ రెడ్డి
- వైస్ చైర్మన్‌గా దామోదర్ గౌడ్ బాధ్యతల స్వీకారం



కల్వకుర్తి, నవంబర్ 24 (జనంసాక్షి):

కల్వకుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.నూతన చైర్మన్‌గా శ్రీపురం హరీశ్వర్ రెడ్డి,వైస్ చైర్మన్‌గా దామోదర్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. వీరితోపాటు నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ శ్రీపురం హరీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. తనకు సహకరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల అభ్యున్నతికి సమష్టిగా కృషి చేయాలి: ఎమ్మెల్యే కసిరెడ్డి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ..సహకార సంఘాలు రైతుల అభివృద్ధికి కీలకంగా నిలవాలని, నూతన పాలకవర్గం రైతుల అవసరాలను గుర్తించి వారికి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.నూతన డైరెక్టర్లుగా జి. భారతమ్మ,బండపల్లి వెంకటమ్మ,మిర్యాల శ్రీనివాస్ రెడ్డి,ఎం.డి. ఆజిముద్దీన్,బాలు నాయక్, భూపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీధర్ రావు, జనార్దన్ రెడ్డి, పోతనపల్లి వెంకటయ్య ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్ కుమార్, అశోక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాలెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ యువతకు సాంకేతిక నైపుణ్యాల వరం

- కల్వకుర్తిలో సంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీ ప్రారంభం..
- డిసెంబర్ 1 నుంచి ఉచిత శిక్షణ

కల్వకుర్తి, నవంబర్ 24 (జనంసాక్షి): గ్రామీణ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఉద్యోగావకాశాలకు అవసరమైన నైపుణ్యాలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో కల్వకుర్తిలో సంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. డిసెంబర్ 1 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు.



యువతకు ఉపాధే లక్ష్యం...

2022 నుంచి యువత అభివృద్ధి కోసం పలు ఉపాధి, శిక్షణ కార్యక్రమాలు చేపట్టినట్లు రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఆమనగల్‌లో నిర్వహించిన ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ శిక్షణలో 60 మందికి అవకాశం కల్పించగా, 22 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయన్నారు. ఉద్యోగ మేళాలు, నైపుణ్య గుర్తింపు కార్యక్రమాలతో పాటు మహిళలకు ప్రత్యేక ఉపాధి అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. 2026 ఏప్రిల్‌లో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉచిత పోటీ పరీక్షల శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి 300 మందికి పైగా అభ్యర్థులకు శిక్షణ, అధ్యయన సామగ్రి అందించినట్లు వివరించారు.

ఆధునిక కోర్సుల్లో శిక్షణ...

సంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీలో కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్, జావా ఫుల్‌స్టాక్, పైథాన్, ఎస్క్యూఎల్, డిజిటల్ మార్కెటింగ్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, జీఎస్టీ, ట్యాలీ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. వీటితో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, రెజ్యూమ్ తయారీ, మాక్ ఇంటర్వ్యూలు, వ్యక్తిత్వ వికాసం, తార్కిక ఆలోచన వంటి అంశాల్లోనూ ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. ఉద్యోగ సమాచారం, ఇంటర్వ్యూలకు మార్గదర్శకత్వం కల్పించనున్నారు.

ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు...

కల్వకుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న పాత కృష్ణవేణి జూనియర్ కళాశాల భవనంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తిగా ఉచితమని, ఆసక్తి ఉన్న గ్రామీణ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలు, దరఖాస్తుల కోసం 63005 53467 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. గ్రామీణ యువత నగరాలకు వెళ్లకుండానే ఆధునిక నైపుణ్యాలు నేర్చుకొని ఉద్యోగాలు సాధించడమే ఈ కేంద్రం లక్ష్యమని రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సాపూర్, నవంబరు 24 (జనంసాక్షి): 132 కేవీ నర్సాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో అత్యవసర మరమ్మతులు, నిర్వహణ పనుల నేపథ్యంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీ రామారావు తెలిపారు.

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నర్సాపూర్ మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని పేర్కొన్నారు. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పున రుద్ధరిస్తామని వెల్లడించారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

భక్తిశ్రద్ధలతో ఎమ్మెల్యే గణపతి హోమం, సత్యనారాయణ స్వామి వ్రతం

నారాయణపేట, నవంబర్ 24 (జనంసాక్షి): నారాయణపేట పట్టణంలోని సివిఆర్ భవన్‌లో కార్తీక పూర్ణిమ సందర్భంగా నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి దంపతులు మంగళవారం భక్తి శ్రద్ధలతో గణపతి హోమం, సత్య నారాయణ స్వామి వ్రతం నిర్వహించారు.ఈ సందర్భంగా నియో జకవర్గ ప్రజలు ఆయురా రోగ్యాలు,సుఖ సంతోషాలతో సిరి సంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మండల కేంద్రంలోని శివాలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు

కేటీదొడ్డి, నవంబర్ 24 (జనంసాక్షి): కార్తీక పౌర్ణమి పర్వదినం భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తుందని, ఈ పవిత్ర సందర్భం సమాజంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని, శాంతి, సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పుతుందని ఆలయ అర్చకులు మల్లు స్వామి తెలిపారు.

ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని శివాలయంలో రవిబాబు ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అందమైన ముగ్గులు వేసి, పూజా సామగ్రి దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అర్చకులు మల్లు స్వామితో పాటు వెంకటేష్ నాయుడు, కొండయ్య, గ్రామస్థులు, మహిళలు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

మర్రిముచ్చాలలో బ్రిడ్జి వద్ద తాత్కాలిక మరమ్మతులు

కొమురవెల్లి, నవంబర్ 24 (జనంసాక్షి): గ్రామ పరిధిలోని ఎన్ హెచ్-365బి జాతీయ రహదారిపై బ్రిడ్జి వద్ద రహదారి ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎన్ ఆర్ ఎం హెల్పింగ్ హ్యాండ్స్ సహకారంతో గ్రామ సర్పంచ్ జంగని రవి ఆధ్వర్యంలో మంగళవారం బ్రిడ్జి వద్ద తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ పనులు చేపట్టడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సహకారం అందించిన ఎన్ ఆర్ ఎం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులకు గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

పశువులకు అమ్మతల్లి వ్యాధి నివారణ టీకాలు

- పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు
- ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి: డాక్టర్ అజింక్య

కోహీర్, నవంబర్ 24 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్ గ్రామపంచాయతీ పరిధిలో పశువులకు అమ్మతల్లి (మాశూచి) వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువులను వివిధ అంటువ్యాధుల నుంచి రక్షించి, వాటి ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఈ టీకాల కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా కోహీర్ పశువైద్యశాల డాక్టర్ అజింక్య మాట్లాడుతూ.. పశువులకు అమ్మతల్లి (మాశూచి) వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. సకాలంలో టీకాలు వేయించడం ద్వారా వ్యాధుల ముప్పును తగ్గించడంతో పాటు పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. పశువులకు వ్యాధులు సోకిన తర్వాత చికిత్స చేయించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం ఉత్తమమని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక కుటుంబాలు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో పశువుల ఆరోగ్య పరిరక్షణకు యజమానులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. పశువులకు నిర్దేశిత సమయంలో టీకాలు వేయించడంతో పాటు వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశువైద్యశాలను సంప్రదించి తగిన చికిత్స పొందాలని తెలిపారు. పశువైద్యశాఖ అందిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పశువుల యజమానులు సద్వినియోగం చేసుకొని తమ పశుసంపదను కాపాడుకోవాలని డాక్టర్ అజింక్య విజ్ఞప్తి చేశారు.



ఎల్లూరులో వైభవంగా కార్తీకమాస ప్రత్యేక పూజలు

భక్తిశ్రద్ధలతో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం భారీగా పాల్గొన్న భక్తులు

కొల్లాపూర్, నవంబర్ 24 (జనంసాక్షి):

పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామంలోని శ్రీ శివాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా సోమవారం తెల్లవారుజామున ఆలయంలో స్వామివారికి వేదమంత్రోచ్చారణల నడుమ విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లోకకల్యాణం, కుటుంబాల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని అత్యంత భక్తిప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమాలకు ఎల్లూరు గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సామూహిక వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కృపాకటాక్షాలు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీ దుర్గి వాసు శర్మ మాట్లాడుతూ పవిత్రమైన కార్తీక మాసంలో భక్తిశ్రద్ధలతో స్వామివారిని ఆరాధించడం ఎంతో విశేషమని తెలిపారు. స్వామివారి అనుగ్రహం దేశ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరికీ మంచి జరగాలని, పాడిపంటలతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఎల్లూరు గ్రామంలో భక్తి భావం వెల్లివిరిసింది.



ఏడుపాయల్లో.. కార్తీకదీపం





పాపన్నపేట, నవంబర్ 24 (జనంసాక్షి): మాతను స్మరిస్తూ భక్తులు బండరాళ్లపై మట్టి ప్రమిదల్లో కార్తీక మాస దీపలను వెలిగించారు. మంగళవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా వనదుర్గమ్మను పూలతో అలంకరించి అర్చకులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. వనదుర్గా క్షేత్రంలో ఘనంగా పల్లకీ సేవా చేపట్టారు. ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపం వెలిగించారు. సాంస్కృతిక కార్యక్రమం, కోలాటం, ప్రకాశిస్తున్న దీపకాంతుల్లో ఏడుపాయల్లో కార్తీకశోభ సంతరించుకుంది.

ప్రమాదకరంగా
మారిన చిన్న అలుగు దారి



ధన్వాడ, నవంబర్ 24 (జనంసాక్షి): ధన్వాడలోని కురువగేరి సమీపంలో ఉన్న చిన్న అలుగు దారిని దాటేందుకు కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలుగు మోరీలో దుర్వాసనతో పాటు బురద పేరుకుపోవడంతో ప్రజలు జారిపడే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ యువ నాయకుడు కురువ నవీన్ ఆవేదన వ్యక్తం చేశారు. అలుగు దాటే మార్గం పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ప్రమాదవశాత్తు ఎవరైనా దానిని తాకితే ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పాలకులు, విద్యుత్ అధికారులు ప్రజా సమస్యను గుర్తించి తక్షణమే స్పందించి అలుగు దారిని సురక్షితంగా మార్చాలని నవీన్ డిమాండ్ చేశారు.

శ్రీ రేణుక మాత
ఆలయంలో వైభవంగా ప్రత్యేక పూజలు



కొల్చారం, నవంబర్ 24 (జనంసాక్షి): కొల్చారం మండల కేంద్రంలోని శ్రీ రేణుక మాత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. పాల్వంచ మౌనిక కృష్ణ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో వర్ని పూజారి నాగరాజు శర్మ వేద మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి విశేష అభిషేకం, ప్రత్యేక అలంకరణతో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ రేణుక మాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని భక్తులు కోరారు.
ఈ కార్యక్రమంలో పాల్వంచ రామకృష్ణ గౌడ్, మాజీ ఎంపీటీసీ అరుణ కృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, ఎండుగుల శేఖర్, రామ గౌడ్, కిరణ్ గౌడ్, యాదగిరి, లక్ష్మి నారాయణ గౌడ్, భూపాల్, చింతలగారి రమేష్, సంజీవులు, అనంతరాజు, వంశీ, సుధాకర్ గౌడ్, పాప గౌడ్, ప్రణీత్ గౌడ్, శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

ప్రజలకు ప్రశ్నించే అధికారం.. సమాచార హక్కు చట్టం!

- **ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం పొందడం ప్రతి పౌరుడి హక్కు**
- **అవినీతి నిరోధానికి, పాలనలో పారదర్శకతకు ఆర్‌టీఐ కీలకం**
- **చట్టంపై ప్రజల్లో అవగాహన పెరగాలి: జర్నలిస్ట్. యం.సుధాకర్**



కోహీర్, నవంబర్ 24 (జనంసాక్షి): ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే కార్యకలాపాలు, ప్రజాధనం వినియోగం, అభివృద్ధి పనుల అమలు తదితర అంశాలపై ప్రశ్నించే హక్కును సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ప్రతి పౌరుడికి కల్పిస్తోందని జర్నలిస్ట్ యం.సుధాకర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శక పాలన, ప్రభుత్వ అధికారుల జవాబుదారీతనాన్ని పెంపొందించడంతో పాటు అవినీతిని వెలికితీయడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.
2005 అక్టోబర్ 12 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన ఈ చట్టంలోని సెక్షన్ 6(1) ప్రకారం భారతీయ పౌరులెవరైనా సంబంధిత ప్రభుత్వ శాఖలకు దరఖాస్తు చేసుకొని అవసరమైన సమాచారాన్ని పొందవచ్చన్నారు. సమాచారం ఎందుకు కావాలో కారణం చెప్పాల్సిన అవసరం లేదని వివరించారు. గ్రామపంచాయతీలకు వచ్చిన నిధులు, వాటి ఖర్చులు, అభివృద్ధి పనుల బిల్లులు, ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలు, సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, నిధుల కేటాయింపులు తదితర వివరాలను ఆర్‌టీఐ ద్వారా తెలుసుకోవచ్చన్నారు.
ప్రజా సమాచార అధికారి (పీఐఓ)కి దరఖాస్తు సమర్పించిన తర్వాత సాధారణంగా 30 రోజుల్లో సమాచారం అందించాల్సి ఉంటుందని తెలిపారు. వ్యక్తి ప్రాణం లేదా స్వేచ్ఛకు సంబంధించిన సమాచారం 48 గంటల్లో అందించాల్సి ఉంటుందన్నారు. నిర్ణీత సమయంలో సమాచారం అందకపోయినా, అసంపూర్ణ సమాచారం ఇచ్చినా మొదటి అప్పీల్, అవసరమైతే రాష్ట్ర సమాచార కమిషన్‌కు రెండో అప్పీల్ చేసుకోవచ్చని వివరించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి నిబంధనల ప్రకారం దరఖాస్తు రుసుము మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.
చట్టంపై పూర్తిస్థాయి అవగాహన లేక చాలామంది ప్రజలు తమ హక్కులను వినియోగించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం అడగడం తప్పు కాదని, అది ప్రతి పౌరుడికి ఉన్న చట్టబద్ధమైన హక్కు అని స్పష్టం చేశారు. ప్రజలు భయపడకుండా, వ్యక్తిగత ఆరోపణలకు తావివ్వకుండా చట్టబద్ధంగా సమాచారాన్ని కోరాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ ఆర్‌టీఐపై అవగాహన పెంపొందించుకొని, ప్రజాధనం సక్రమంగా వినియోగమవుతోందో లేదో తెలుసుకోవాలని జర్నలిస్ట్ యం. సుధాకర్ పిలుపునిచ్చారు.

బగలశక్తిపీఠంలో కార్తీక పౌర్ణమి పూజలు...

- **యజ్ఞంలో పాల్గొన్న భక్తులు**



శివ్వంపేట, నవంబర్ 24 (జనంసాక్షి): భారతదేశ నలువైపుల నుంచే కాకుండా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శివ్వంపేటలో కొలువైన శ్రీ భగలాముఖి శక్తిపీఠానికి తరలివచ్చి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాంగణంలోని యాగశాలలో ఆలయ ట్రస్టు చైర్మన్ ఉపాసకులు శాస్త్రుల లక్ష్మి వెంకటేశ్వరశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు కమలేష్ పండిట్ ఆధ్వర్యంలో భగలాముఖి అమ్మవారికి యాగశాలలో మహా మంత్రహవనం, మహాపూజ, అర్చన పంచామృతలతో అభిషేకం, హరిదార్చన, పూర్ణాహుతితో పూజలు ముగించారు. వచ్చిన భక్తులకు పూజలు ముగిసిన తర్వాత తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు భక్తులు అమ్మవారికి వడిబియ్యం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు పులిహోర వితరణ చేశారు. ఆ తర్వాత తులసి కోట వద్ద భక్తులు పెద్ద ఎత్తున దీపారాధన చేశారు.దీంతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు శాస్త్రుల పురుషోత్తమ శర్మ, వెంకట రమణ శర్మ,లక్ష్మి వెంకటేశ్వర శర్మ, పబ్బా మహేష్ గుప్త, శ్రీనివాస్ గౌడ్, శాస్త్రుల వివేక్ శర్మ, రేఖ, రమ్య భక్తులు ఉన్నారు.

మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా గొండ రఘుపతి



అల్లాదుర్గం, నవంబర్ 24 (జనంసాక్షి): అల్లాదుర్గం మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల అధ్యక్షుడిగా గోండ రఘుపతి రెండవ సారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేకరుల సమస్యల సాధన దిశగా తన ప్రయత్నం ఉంటుందని విలేకరులకు అండగా ఉంటానని నాపై నమ్మకముంచి రెండవసారి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నుకుందుకు ఆయన తోటి విలేకరులకు ధన్యవాదాలు తెలియజేశారు.
ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, ఉపాధ్యక్షుడిగా పాపయ్య, గౌరవ అధ్యక్షుడిగా వీరేందర్, భూమయ్య, సహాయ కార్యదర్శులుగా శేఖర్, నరేశ్, వెంకట్, కోశాధికారిగా రాజు, సలహాదారులుగా రమేష్, శంకర్, వెంకట్ రాం, సాయిలు, సభ్యులుగా రాజు, నర్సింలు, హర్షద్, రాజ్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి

- **ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి**
- **ఆకునూరులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రారంభం**



చేర్యాల, నవంబర్ 24(జనంసాక్షి): ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి అన్నారు. మంగళవారం చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వ్యవసాయ భూమి పట్టాదారు పాస్ పుస్తకం ఉంటేనే రైతు బీమా వర్తించేదని, నేడు ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదల సంక్షేమం కోసం రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని తీసుకొచ్చి ప్రతి నిరుపేద కుటుంబానికి ఈ పథకాన్ని అందిస్తూ ప్రజా ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొయ్యడ సందీప్, వార్డు సభ్యురాలు అందె లక్ష్మీ, జూపల్లి కార్తీక్ రెడ్డి,స్వర్గం రాజేష్, అందె నాని బాబు, వెలుగల రఘువీర్, ఆకుల రాజు గౌడ్, అందె అశోక్, కడారి భాస్కర్, రణం శ్రీకాంత్, పుల్లని నర్సింగరావు, రణం శ్రీకాంత్, తోళ్ల వేణు, తాటికొండ సుభాష్,గోనెపల్లి రాజు,కోయినేని బలరాం, సూర్న సాయిలు, పందిళ్ళ లక్ష్మీనారాయణ, తాటికొండ రాజయ్య, పోలోజు సుదర్శన్, నరేష్, రాజు,తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ మండలం బీజేపీ యువమోర్చా మండల కమిటీ ఏర్పాటు



కృష్ణ, నవంబర్ 24 (జనంసాక్షి): కృష్ణ మండలం బీజేపీ అధ్యక్షుడు నల్లే నర్సప్ప ఆధ్వర్యంలో మండల యువమోర్చ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యువ మోర్చా మండల అధ్యక్షుడు వొట్టేపోళ్ల సురేష్ ఆధ్వర్యంలో మండల యువ, ప్రధాన కార్యదర్శులు జెరకల్ తరుణ్, లోకేష్ లను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం యువతను పార్టీ కార్యక్రమాల్లో మరింత చురుకుగా భాగస్వామ్యం చేస్తూ, పార్టీ బలోపేతమే లక్ష్యంగా బీజేపీ యువ మోర్చా కృష్ణ మండలానికి పూర్తి స్థాయి మండల కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన మండల కమిటీ సభ్యులకు శుభా కాంక్షలు తెలియజేస్తూ, పార్టీ సిద్ధాంతాలు, ప్రజాసేవ, యువత సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ, గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి నూతన కమిటీ పనిచే యాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు నల్లె నర్సప్ప, ప్రధాన కార్యదర్శి దండు రాఘవేంద్ర, మాజీ అధ్యక్షుడు, ఖాన్ దొడ్డి శ్రీనివాసులు, జెగ్గిలి హుసేనప్ప, మాజీ సర్పంచ్ తిమ్మప్ప కొత్తపల్లి, బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శి సుమంత్, వడ్వట్ రమేష్, పంతిగి ఆంజనేయులు, ముడుమాల్ బీజేవైఎం గ్రామధ్యక్షులు ఆంజనేయులు, కార్తిక్ కోలీ, ఈడిగి విజయ్, వడ్వట్ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

త్వరలో అందుబాటులోకి తాగునీటి ట్యాంకులు

- **మున్సిపల్ నిధులతో నిర్మాణ పనులు ముమ్మరం..**
- **9వ వార్డులో తుది దశకు చేరిన పనులు**



నర్సాపూర్, నవంబర్ 24 (జనంసాక్షి): నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. పట్టణంలోని 4, 9వ వార్డుల్లో మున్సిపల్ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న భారీ మంచినీటి ట్యాంకుల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 4వ వార్డులో 6 లక్షల లీటర్ల సామర్థ్యంతో, 9వ వార్డులో 7.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ట్యాంకుల పనులను మెగా ఇంజనీరింగ్ సంస్థ చేపట్టి వేగవంతంగా పూర్తి చేస్తోంది. ఇప్పటికే 9వ వార్డులో నిర్మిస్తున్న 7.5 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు పనులు తుది దశకు చేరుకున్నాయి. దీంతో త్వరలోనే ఈ ట్యాంకును ప్రజలకు అందుబాటులోకి తీసుకు రానున్నారు. అదేవిధంగా 4వ వార్డులో నిర్మిస్తున్న 6 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు నిర్మాణ పనులను మరో రెండు, మూడు నెలల్లో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురానున్నట్లు మెగా ఇంజనీరింగ్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ ట్యాంకులు అందు బాటులోకి వస్తే ఆయా వార్డులతో పాటు పరిసర ప్రాంతాల్లో తాగునీటి సరఫరా మెరుగు పడనుంది. వేసవిలోనూ నీటి ఇబ్బందులు తగ్గి ప్రజ లకు ఎంతో ఊరట కలగనుంది. ట్యాంకుల నిర్మాణం పూర్తయితే పట్టణంలో తాగునీటి సమస్యకు గణనీయం గా పరిష్కారం లభించనుంది.

విజపల్లిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం



కోహెడ, నవంబర్ 24(జనంసాక్షి): మండలంలోని విజపల్లి గ్రామంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' కార్యక్రమాన్ని సర్పంచ్ అన్నాడి శ్రీజ-జీవన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని అన్నారు. కుటుంబ యజమాని అనుకోకుండా మరణించిన సందర్భంలో ఆ కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల జీవిత బీమా ఆర్థిక సహాయం అందించడం ద్వారా బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజిరెడ్డి, ఉపసర్పంచ్ రంగనవేని వెంకటస్వామి, వార్డు సభ్యులు చిట్యాల కవిత-సదానందం, అన్నాడి రాజేందర్ రెడ్డి, బొదాసు తిరుపతి, అక్కరవేని సంపత్, కొమ్ముల దీప్తి--సునీల్ రెడ్డి తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా శ్రీ తిమ్మప్ప స్వామి కళ్యాణం



మల్దకల్, నవంబర్ 24 (జనంసాక్షి): ఆది శిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగళవారం శ్రీ తిమ్మప్ప స్వామి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా వేదమంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు,ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో దేవాలయంలో జరిగిన పూజలు అనంతరం కళ్యాణం కార్యక్రమానికి దంపతులు హాజరై కళ్యాణం జరిపించారు.

అనంతరం వారికి స్వామి వారి శేష వస్త్రం తీర్థప్రసాదాలు అందజేశారు.శేషంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి దంపతులు, మల్దకల్ గ్రామానికి చెందిన నరహరి వెంకటేష్ దంపతులు, ప్రవీణ్ కుమార్ దంపతులు కళ్యాణం చేయించారు.ఈ కార్యక్రమంలో అర్చకులు రమేష్ ఆచారి,రవిఆచారి, చంద్రశేఖరరావు,ఆరగిద్ద రాముడు తదితరులు పాల్గొన్నారు.

సికింద్లాపూర్ లక్ష్మీ నరసింహుడికి ప్రత్యేక పూజలు



శివ్వంపేట, నవంబర్ 24 (జనంసాక్షి): శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామ శివారులో స్వయం వ్యక్త లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో మంగళవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దేవాలయం లో స్వామివారిని దర్శించుకొని పూజలు చేపట్టారు. అతర్వాత కార్తీక దీప నీరాజనం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో భక్తులు దేవస్థానం కార్యనిర్వాహణ అధికారులు, ఆలయ ప్రధాన అర్చకులు ధనంజయ శర్మ,పూజారి విద్యాకర్ చారి, జూనియర్ సహాయకులు ఎస్.నరసింహారెడ్డి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శంభు ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు

- **ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహణ**



నంగునూర్, నవంబర్ 24 (జనంసాక్షి): మండల పరిధిలోని పాలమాకుల శంభు దేవాలయంలో మంగళవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎల్లంకి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్తులు, దాతల సహకారంతో పురాతన శంభు దేవాలయాన్ని పునర్నిర్మాణం చేసుకుంటామని తెలిపారు.



ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతనబోయిన ఓజాల్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ చక్రవర్తి, ఐలయ్య, రేపాక రవీందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తు లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక మాస ప్రత్యేక పూజలు....

- **పలు ఆలయాలలో కార్తీక దీపోత్సవం**



పెద్ద శంకరంపేట్, నవంబర్ 24 (జనంసాక్షి): కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కొప్పోలు ఉమా సంగమేశ్వర స్వామి దేవాలయం.. గురుపాద గుట్ట శివాలయంలో గొట్టుముక్కల ఆత్మ లింగేశ్వర స్వామి దేవాలయం.. పేటలోని శివాలయం.. మాణిక్ ప్రభు మందిరం విరలేశ్వర మందిరం పలు ఆలయాలలో మంగళవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.. మహిళలు కార్తిక దీపాలను వెలిగించి వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు.. ఆయా దేవాలయాలలో మహిళలు ఉదయం నుండి దీపాలను వెలిగించడం తో పాటు ఒత్తులను కాల్చారు.. అధిక సంఖ్యలో మహిళలు భక్తులు కార్తిక దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు...

కార్తీక పౌర్ణమి వేడుకలు... ఆత్మకూర్‌లో వైభవంగా దీపోత్సవం

ఆత్మకూర్, నవంబర్ 24 (జనంసాక్షి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆత్మకూర్ పట్టణంలోని నేతాజీ నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో మహిళలు ఘనంగా దీపోత్సవాన్ని నిర్వహించారు.

ఆలయ ప్రాంగణమంతా దీపకాంతులతో వెలిగిపోయింది. పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి చేరుకుని, దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.కార్తీక మాసంలో దీపారాధన చేస్తే సకల సౌభాగ్యం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు.

శ్రీశ్రీశ్రీ సిద్దప్ప వరకవి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ





కోహెడ, నవంబర్ 24 (జనంసాక్షి): మండలంలోని గుండారెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా సిద్ధప్ప వరకవి రాజయోగి కళా పీఠం నందు గోల్కొండ కవి శ్రీశ్రీశ్రీ సిద్ధప్ప వరకవి రాజయోగి జీవిత చరిత్ర మీద శతకము ను రచించిన సుప్పని సత్యనారాయణ, అలాగే సిద్ధప్ప కుమారుడు కవిచంద్ర అనంత వరం మాణిక్య లింగం చేతుల మీద పుస్తకమును ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సర్పంచ్ పిల్లి బాబు వీరితో పాటు మాజీ సర్పంచ్ సుతారి కనుకరాజు, ఉపాధ్యాయుడు తొగిటి సత్యనారా యణ, సిద్ధప్ప కుటుంబ సభ్యులు, భక్తులు, అలాగే గ్రామస్తులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

సహకార అంజన్నకు దీపాల వెలుగులు



శివ్వంపేట, నవంబర్ 24 (జనంసాక్షి): శివ్వంపేట మండలం చాకరిమెట్లలో స్వయంబు సహకార ఆంజనేయస్వామి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగళవారం రాత్రి భక్తులు వెలిగించిన దీపాల కాంతుల్లో దగదగా వెలుగుతున్న సహకార ఆంజనేయస్వామి.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



అయిజ, నవంబర్ 24 (జనంసాక్షి): అయిజ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బడే సాబ్ యాదవ్ ఆధ్వర్యంలో ఉప్పల, పులికల్, ఎక్లాస్పూర్ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 70,000 విలువగల చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బడే సాబ్ యాదవ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు మెరుగైన వైద్యం అందేలా ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని భరోసా ఇచ్చారు. అనుకోని ఆపద సమయంలో తమకు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నందుకు ప్రభుత్వానికి మరియు స్థానిక నాయకులకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు ఎల్లప్పుడూ ముందుండటంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ నరసింహులు, సర్పంచులు తిమ్మోతి, దేవరాజులతో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు

కొల్చారం మండల బీజేవైఎం ఉపాధ్యక్షుడు శివప్ప గారి సతీష్ కుమార్



కొల్చారం, నవంబర్ 24 (జనంసాక్షి): గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 16వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు కేటాయిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తోడ్పడుతుందని కొల్చారం మండల బిజెవైఎం ఉపాధ్యక్షుడు శివప్ప గారి సతీష్ కుమార్ అన్నారు. దేశ అభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని నమ్మిన కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు అందిస్తూ అభివృద్ధికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ గ్రామాల అభివృద్ధికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఇందిరమ్మ చీరలు, ఉచిత బస్సు వంటి పథకాలపై చూపుతున్న శ్రద్ధ గ్రామాల అభివృద్ధిపై కూడా చూపాలని హితవు పలికారు.

16వ ఆర్థిక సంఘం నిధులతో పాటు ఎంపీ నిధులను సైతం సమర్థవంతంగా వినియోగించుకుంటూ కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి, కిష్టాపూర్ గ్రామాలు అభివృద్ధి పనుల్లో ముందున్నాయని తెలిపారు. రాష్ట్రంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు ఉన్నప్పటికీ గ్రామాల కోసం ప్రత్యేక నిధులు తీసుకురాలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, పెండింగ్ పనులను వెంటనే చేపట్టాలని సతీష్ కుమార్ డిమాండ్ చేశారు.

చాకరిమెట్ల అంజన్నకు పూర్ణిమ ప్రత్యేక పూజలు



శివ్వంపేట, నవంబర్ 24 (జనంసాక్షి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామ శివారులోని చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి స్వయంభూ క్షేత్రానికి మంగళవారం సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలతో పాటుగా జంట నగరాలు అలాగే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు దేవాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో స్వామివారికీ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయస్వామికీ అభిషేకం, అర్చన, మన్యాసుక్త పారాయణం, బిల్వ దళర్చన, ఆకుపూజా, పంచామృతాలతో అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా రామాలయంలో స్వామివారి దర్శనం పూజల తర్వాత అర్చకులు భక్తులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులు, దంపతులు భారీ సంఖ్యలో సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించి, వారి మొక్కులు తీర్చుకున్నారు. రామ మందిరంలో స్వామివారి దర్శించుకొని భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అయితే కార్తీకపూర్ణిమతో భక్తజనంతో ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణ ప్రాంతాలలో భక్తులు దీపాలు వెలిగిస్తూ, నిండుగా జనజాతర లాగా కనిపించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన పౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు శాస్త్రుల దేవాదత్తు శర్మ, దేవిశ్రీ ప్రసాద్ శర్మ, ప్రభురాజశర్మ, సిబ్బంది రామకృష్ణ, నరసింహులు, ప్రకాష్‌లతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఐరన్ మ్యాన్ ఫినిషర్ కార్వంగ కృష్ణకు ఘన సన్మానం

- **గోవాలో 33 దేశాల క్రీడాకారులతో పోటీపడి విజయం**
- **బ్రెజిల్ పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్ష**



రేవల్లి, నవంబర్ 24 (జనంసాక్షి): ఇటీవల గోవాలో జరిగిన 'ఐరన్ మ్యాన్ 70.3 ఇండియా' ఎండ్యూరెన్స్ ఛాలెంజ్ పోటీల్లో ఫినిషర్‌గా నిలిచిన నాగపూర్ గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి, ప్రస్తుతం ఆర్బీఐ ఉద్యోగి కార్వంగ కృష్ణను గ్రామ మాజీ ఎంపీటీసీ దొడ్డి శ్రీశైలం ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా దొడ్డి శ్రీశైలం మాట్లాడుతూ, 33 దేశాలకు చెందిన 2,200 మంది క్రీడాకారులు పాల్గొన్న అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఒకే రోజు 1.9 కి.మీ. సముద్రపు ఈత, 90 కి.మీ. సైక్లింగ్, 21.1 కి.మీ. రన్నింగ్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేసి మన గ్రామానికి, రాష్ట్రానికి ఎంతో గర్వకారణంగా నిలిచారని అభినందించారు. త్వరలో బ్రెజిల్‌లో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కూడా కృష్ణ విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం కృష్ణను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా

పూలే, అంబేద్కర్ వర్ధంతులను నిర్వహించాలి

- **అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్ పిలుపు**



మక్తల్, నవంబర్ 24 (జనంసాక్షి): చదువు అనే ఆయుధంతో బహుజనుల జీవితాల్లో వెలుగులు నింపిన మహాత్మా పూలే (నవంబర్ 28), డా. బి.ఆర్. అంబేద్కర్ (డిసెంబర్ 6) వర్ధంతులను గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని డా. బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు.

మంగళవారం మక్తల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధిపత్య వర్గాల కుల వివక్షను, మనుస్మృతి దురాచారాలను ఎదిరించి బహుజనులకు చైతన్యం, రాజ్యాంగ హక్కులు కల్పించిన మహనీయుల ఆశయాలను సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా నేటి యువతకు అందించాలని కోరారు.

ఎల్లికట్ట తండా ప్రజల దాహార్తి తీర్చిన ఉప్పల వెంకటేష్

- **రూ.లక్ష విలువైన బోరు మోటారు అందజేత**
- **గిరిజన ప్రజల ఇబ్బందులను గుర్తించి తక్షణ సాయం**



కల్వకుర్తి, నవంబర్ 24 (జనంసాక్షి): కల్వకుర్తి నియోజకవర్గంలోని ఎల్లికట్ట తండా గిరిజన ప్రజల తాగునీటి కష్టాలను గుర్తించిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్,ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మానవతా దృక్పథంతో ముందుకొచ్చి తండా ప్రజల దాహార్తిని తీర్చారు. కల్వకుర్తి మండలం ఎల్లికట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లికట్ట తండాలో మిషన్ భగీరథ ద్వారా సరిపడా నీరు అందక గిరిజన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

ఈ విషయం తెలుసుకున్న ఉప్పల వెంకటేష్ వెంటనే స్పందించి, తండా ప్రజలకు సుమారు లక్ష రూపాయల విలువైన బోరు మోటారును అందజేశారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న తమకు సకాలంలో సహాయం అందించి ఆదుకున్న ఉప్పల వెంకటేష్‌కు తండా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. తండా ప్రజల దాహార్తిని తీర్చిన ఉప్పల వెంకటేష్ సేవలను గిరిజనులు కొనియాడారు.

యాదగిరిగుట్టకు ప్రశాంత్ గౌడ్ పాదయాత్ర

- **సర్పంచ్‌గా దివ్యవాణి గెలుపు కోసం మొక్కు.**
- **తోగర్‌పల్లి నుంచి యాదగిరిగుట్టకు భక్తిశ్రద్ధలతో పాదయాత్ర ప్రారంభం**



కొండాపూర్, నవంబర్ 24 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తోగర్‌పల్లి గ్రామం నుంచి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి తొగరుపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రశాంత్ గౌడ్ పాదయాత్ర ప్రారంభించారు. గ్రామ సర్పంచ్‌గా తన సతీమణి దివ్యవాణి విజయం సాధించాలని స్వామివారికి మొక్కుకున్న ప్రశాంత్ గౌడ్, ఆ మొక్కు తీర్చుకునేందుకు భక్తిశ్రద్ధలతో కాలినడకన యాత్ర చేపట్టారు.



ఈ సందర్భంగా స్వామివారి అనుగ్రహంతో సర్పంచ్‌గా దివ్యవాణి విజయం సాధించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ విజయానికి సహకరించిన గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు సుభిక్షంగా జీవించాలని, తోగర్‌పల్లి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. పాదయాత్రలో తనకు తోడుగా నడుస్తూ మద్దతు తెలుపుతున్న గ్రామ ప్రజలు, అభిమానులు, శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కులమతాలకు అతీతంగా ప్రజల ఆశీస్సులతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

కార్తీక పున్నమి జ్యోతుల్లో అయ్యప్ప దివ్యవైభవం

దీపారాధనలు, భజనలతో మార్మోగిన గోపాలపేట అయ్యప్ప సన్నిధానం



గోపాలపేట, నవంబర్ 24 (జనంసాక్షి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని గోపాలపేటలోని అయ్యప్ప సన్నిధానంలో దీపారాధన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు వెలిగించిన దీపజ్యోతులు, భజనల నాదాలు, సామూహిక శరణుఘోషలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్తీక పున్నమి వెన్నెలలో దీపాల వెలుగులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కాశిపతి గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు స్వయంగా దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఒక్కొక్కటిగా వెలిగిన దీపజ్యోతులతో అయ్యప్ప సన్నిధానం దేదీప్య మానంగా మారింది. అనంతరం నిర్వహించిన అయ్యప్ప భజనలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి.

తాళాల సవ్వడులు, భజనల మధుర స్వరాలు, అయ్యప్ప నామస్మరణతో పరిసర ప్రాంతమంతా మార్మోగింది. స్వాములు ఏకకంఠంతో 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ శరణుఘోష చేయడంతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. దీపజ్యోతుల వెలుగులు, భజనల నాదాలు, శరణుఘోషలతో గోపాలపేటలో శబరిమలను తలపించే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

కార్తీక పౌర్ణమి పవిత్రతకు అయ్యప్ప భక్తి తోడవడంతో ఈ వేడుక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు స్వామివారి పూజల్లో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

ఈ కార్యక్రమంలో శ్రావణ్ కుమార్, శివరాజు తదితరులు పాల్గొని పూజా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. భక్తుల సామూహిక శరణుఘోషలు, దీపారాధనలతో నిర్వహించిన ఈ వేడుక అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

స్వామియే శరణం అయ్యప్ప!

కోహెడ గ్రామ పంచాయతీలో

‘ఇందిరమ్మ బీమా పథకం’ ప్రారంభం



కోహెడ, నవంబర్ 24(జనంసాక్షి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన “ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం” నమోదు కార్యక్రమాన్ని సర్పంచ్ బందెల సుజాత బాలకిషన్ గారు పాలకవర్గ సభ్యులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకమును అందరు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చుక్క శంకర్, జాలిగం స్వప్న –బాల్‌రాజ్, గజ్జెల ప్రవీణ్, పొన్నాల శ్రావణి –అశోక్ పంచాయతీ కార్యదర్శి సురేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకట స్వామి, మంద వంశీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ పేర్లను నమోదు చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జాతీయ మాల మహానాడు

జిల్లా వర్కింగ్ అధ్యక్షులుగా చింతల విజయ్ కుమార్



చేర్యాల, నవంబర్ 24 (జనంసాక్షి): జాతీయ మాల మహానాడు సిద్దిపేట జిల్లా వర్కింగ్ అధ్య క్షులుగా చింతల విజయ్ కుమార్ నియామకం మాల సామాజిక వర్గ అభ్యున్నతి కోసం, విద్య ఉద్యోగ, రాజకీయ రంగాలలో మాల హక్కుల కోసం కృషి చేసినందుకు గాను సంఘాన్ని జిల్లాలో మరింత బలోపేతం చేస్తూ,మాలల ఐక్యత కోసం కృషి చేసినందుకు గాను నాకు బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్‌కి జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్ కి,రాష్ట్ర పోలిట్ బ్యూరో చైర్మన్ శ్రీరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బుట్టి సత్యనారాయణ,వెన్న రాజు,రాష్ట్ర సంస్కృతిక చైర్మన్ ఎలుక దేవయ్య, జిల్లా నాయకులు డివిజన్ నాయకులు నియోజకవర్గం మండల నాయకులకు నా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదములు తెలిపారు.

ఐనాపూర్ - సూకర్

లింగంపల్లి రోడ్డు పనులు ప్రారంభం





కృష్ణ, నవంబర్ 24 (జనంసాక్షి): కృష్ణ మండలం ఐనాపూర్ గ్రామం నుండి సుకూర్ లింగంపల్లి గ్రామం, వరకు 4 కోట్లతో 4 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రహదారి నిర్మాణ పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు.దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న రహదారి సమస్యకు పరిష్కారం చూపుతూ, రూ. 4 కోట్ల భారీ నిధులతో ఐనాపూర్ గ్రామం నుండి సుకూర్ లింగంపల్లి గ్రామం వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర చేపట్టనున్న ఆర్ అండ్ బీ రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు వాకిటి గిరి సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు విజయగౌడ ఆధ్వర్యంలో ఈ రహదారి నిర్మాణ పనులను ప్రారంబించారు. ఈ రహదారి నిర్మా ణం పూర్తయితే ప్రజల రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు, విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపార రంగాలకు ఎంతో ప్రయోజ నం చేకూరుతుంది. గ్రామాల మధ్య అనుసంధానం మెరు గుపడి ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుంది. ఈ కార్యక్రమంలో ఐనాపూర్ సర్పంచ్ శరణ్య స్వామి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మాలి పాటిల్ విజయ గౌడ, ఉపాధ్యక్షులు నారాయణ, యువజన అధ్యక్షుడు షేక్ సర్వరాజు, మండల ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి పల్లె సురేష్ కృష్ణ సర్పంచ్ నాగేష్ యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్ రెడ్డి, సీనియర్ నాయకులు లింగప్ప, నాగేశ్వరరావు, నాగేందర్, తమ్మప్ప ,ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు నాగప్ప, కృష్ణ మండలం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బాగ్లి మహేష్,తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ బీమా పత్రాల పంపిణీ

- సర్పంచ్ బైరా మానస రాజేందర్



బెజ్జంకి,నవంబర్ 24 (జనంసాక్షి): పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారు లకు బీమా పత్రాలను పంపిణీ చేశారు. మంగళవారం దాచారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ బైరా మానస రాజేందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భం గా సర్పంచ్ మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం ఈ పథకం ద్వారా అండగా నిలుస్తుందని తెలిపారు.అర్హులైన కుటుంబా లకు నిబంధనల ప్రకారం బీమా రక్షణ కల్పించడంతో పాటు ఆర్థిక సహాయం అందుతుందని పేర్కొన్నారు. ఈ సాయం కుటుంబ అవసరాలు,పిల్లల చదువుల కొనసాగింపునకు ఎంతగానో తోడ్పడు తుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబాని కి ప్రభుత్వ పథకాలు అందేలా గ్రామపంచాయతీ తరఫున కృషి చేస్తామని తెలిపారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దీటి బాల నర్సు, పంచాయతీ కార్యదర్శి సురేష్, వార్డు సభ్యులు నేతి మహేష్, సవనపెల్లి రాజు, గదగోని అశోక్,గ్రామ పెద్దలు నవీన్, శ్రీకాంత్, కానుకయ్య, రాజు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి వేడుకలకు పోటెత్తిన భక్తులు

బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో వైభవంగా ప్రత్యేక పూజలు, చండీ హోమం





గుమ్మడిదల, నవంబర్ 24 (జనంసాక్షి): కార్తీక పౌర్ణ మి పర్వదినాన్ని పురస్కరించుకొని బొంతపల్లి గ్రామం లోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వ హించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ ఆలయ చైర్మన్ ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో చండీ హోమం వైభవంగా జరిగింది. హోమ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొం దారు. ఆలయానికి విచ్చేసిన భక్తుల కోసం నిర్వాహకులు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అదేవిధంగా మంగళవారం సాయంత్రం తులసీ కల్యా ణం, లక్షపత్తుల కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకుల ఆధ్వర్యంలో అన్ని కార్యక్రమాలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకల్లో గ్రామస్తులు, మహిళలు, యువతతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిలకు రూ.30 వేల ఆర్థిక సహాయం!

- అర్హత కలిగిన ప్రతి నమోదిత చర్చికి ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటు
- ఈనెల 23 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు



కోహిర్, నవంబర్ 24 (జనంసాక్షి): క్రిస్మస్ పండు గను పురస్కరించుకొని రాష్ట్రంలోని క్రైస్తవ మైనారిటీలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. క్రిస్మస్ వేడుకలను ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అర్హత కలిగిన ప్రతి నమోదిత చర్చికి రూ.30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కో–ఆపరేషన్ ప్రతినిధి అస్మా తబస్సుమ్ వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... క్రిస్మస్ పండుగను పురస్క రించుకొని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఇతర వేడుకలను నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన చర్చిల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా అవసరమైన వివరాలు, పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని చర్చిల నిర్వాహకులకు సూచించారు.

క్రైస్తవ మైనారిటీలకు పండుగ సమయంలో ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల క్రైస్తవ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన ప్రతి చర్చికి ఈ సహాయం అందేలా సంబంధిత నిర్వాహకులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కార్తీక పౌర్ణమి వేడుకల్లో భక్తిశ్రద్ధలతో మహిళల దీపారాధన!





బాలానగర్, నవంబర్ 24 (జనంసాక్షి): బాలానగర్, కార్తీక పౌర్ణమి పర్వదినా న్ని పురస్కరించుకుని బాలానగర్ మం డల కేంద్రంలోని శివాలయం, భవానీ మాత ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధ లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళా భక్తులు కొత్త దుస్తులు ధరించి, ఉపవాస దీక్షలు చేపట్టి ఆలయాలకు చేరుకున్నారు.

ఈ సందర్భంగా శివాలయం, భవానీమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి దీపారాధన చేశారు. ఆలయ ప్రాంగణాల్లో దీపాలను వెలిగించి భక్తిపారవశ్యంతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన రోజుగా భావించే కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపాలు వెలిగించి, కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని మహిళలు భగ వంతుడిని ప్రార్థించారు.

దీపాల వెలుగులతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, భక్తుల రాకతో ఆలయాల్లో పండుగ వాతావరణం నెల కొంది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.



చేర్యాలలో
ఇందిరమ్మ జీవిత బీమా నమోదు



చేర్యాల, నవంబర్ 24 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమం చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. 12వ వార్డు కౌన్సిలర్ షరీఫా బేగం ఖాజా కార్యాలయాన్ని సందర్శించి లబ్ధిదారులకు పథకాన్ని వివరించారు. 12వ వార్డుకు చెందిన ప్రజలకు దగ్గరుండి నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబంలో 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వరకు ఉన్న వారు ఈ పథకానికి అర్హులని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడ్ల చంద్రం, తుమ్మలపల్లి సంతోష్, మాచర్ల వెంకటేశం, మాచర్ల రాజేష్, తాటిపాముల పరుశురాములు, బుట్టి యాదగిరి, మున్సిపల్ సిబ్బంది శ్రావణ్, చేర్యాల ప్రజలు పాల్గొన్నారు.

బాలానగర్ అయ్యప్ప
ఆలయంలో వైభవంగా మహా పడిపూజ!

- **భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన అయ్యప్ప స్వాములు, భక్తజనం.. మారుమోగిన అయ్యప్ప నామస్మరణ!**



బాలానగర్, నవంబర్ 24 (జనంసాక్షి): బాలానగర్, మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కిక్కిరిసింది. భక్తుల జయజయధ్వానాలు, అయ్యప్ప నామస్మరణల మధ్య పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.



ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అర్చనలు, ఆరాధనలు నిర్వహించి మహా హారతి సమర్పించారు. పవిత్రమైన 18 మెట్ల వద్ద అయ్యప్పస్వామి ప్రతిమను ప్రతిష్ఠించి పూలతో సుందరంగా అలంకరించారు. అనంతరం దీపారాధన నడుమ పండ్లు, పూలు, ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వాముల భజనలు, భక్తి గీతాలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అయ్యప్ప స్వాముల భజనలతో మారుమోగిన ఆలయ వాతావరణం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు, భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. మహా పడిపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకునే భాగ్యం కలగడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆలయాల్లో దీపాల వెలుగులు.. శివనామస్మరణతో మార్మోగిన క్షేత్రాలు

- **దీపారాధనలతో భక్తిశ్రద్ధల మధ్య కార్తీక పౌర్ణమి వేడుకలు**

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 24 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. తెల్లవారుజామునే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి శివకేశవులను దర్శించుకున్నారు. జిల్లాలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు నిర్వహించారు. నెల రోజులుగా కొనసాగుతున్న కార్తీక దీపారాధనలు, ఉపవాసాలు, వ్రతాలు, దానధర్మాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

శివకేశవులకు ప్రత్యేక పూజలు..

కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు, విష్ణు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఉపవాసాలు పాటిస్తూ రుద్రాభిషేకాలు, సత్యనారాయణ స్వామి



వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉసిరిచెట్ల



వద్ద ప్రమిదలు వెలిగించి భక్తితో పూజలు చేశారు. పలుచోట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వనభోజనాలు నిర్వహించారు.

సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా కార్తీక పౌర్ణమి..

కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపాలు వెలిగించడం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. కుటుంబ సభ్యులంతా కలిసి ఆలయాలను దర్శించుకోవడం, దీపారాధనలు, దానధర్మాలు చేయడం ద్వారా ఆధ్యాత్మిక భావనతో పాటు కుటుంబ అనుబంధాలు బలపడతాయని పెద్దలు పేర్కొన్నారు. అహంకారం, అసూయ, ద్వేషం వంటి అంధకారాన్ని తొలగించుకొని ప్రేమ, దయ, సేవాభావాన్ని అలవర్చుకోవాలనే సందేశాన్ని ఈ పర్వదినం అందిస్తుందని



తెలిపారు.

ఆలయాల్లో మహిళా భక్తుల సందడి..

సంగారెడ్డితో పాటు సదాశివపేట, పటాన్‌చెరు, అమీన్‌పూర్, జహీరాబాద్, జోగిపేట, న్యాల్‌కల్, నారాయణఖేడ్ తదితర ప్రాంతాల్లోని శివాలయాలకు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉసిరిచెట్ల కింద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు..

సదాశివపేటలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో 1983–84 పదవ తరగతి మిత్రబృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గంట శివయ్య, కార్యదర్శి పృథ్వీరాజ్, శంకర్ సార్, వెంకటరావు పాటిల్, విశ్వనాథం తదితర భక్తులు పాల్గొన్నారు.

సంఘమేశ్వరుడి భక్తుల పూర్ణిమ పూజలు

శివ్వంపేట, నవంబర్ 24 (జనంసాక్షి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని పెద్దగొట్టిముక్ల గ్రామ శివారులోని ఉమా సంఘమేశ్వర స్వామి దేవాలయానికి జిల్లా నాలు వైపులతో పాటు జంట నగరాల నుంచి మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో ఉమా సమేత సంఘమేశ్వరుడిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుడు చండిక శర్మ ఆధ్వర్యంలో మొదటగా గణపతి పూజ జరిపి, ఆ తర్వాత నియమ నిష్టాలతో ఉమా సంఘమేశ్వరుడి వేద మంత్రోచ్ఛారణ ద్వారా మహా న్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు బిల్వదళాలు సమర్పించి, అమ్మవారికి సైతం పసుపు, కుంకుమ, గంధంలతో అభిషేకం చేసి, అద్భుతం గా స్వామి వారి రూపాన్ని అలంకరించారు.

ఆ తర్వాత వేదోక్తంగా మంగళహారతి, మంత్ర



పుష్పం పాటించి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గవించారు. అంతకుముందు నక్షత్రా వనం లో భక్తులు పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలను వెలిగించి, ఆ దీపాలా కాంతుల మధ్యనే భక్తజనాలు తన్మయత్వం పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, ప్రముఖ న్యాయవాది గోళీపల్లి హన్మంత్ రెడ్డి, కవిత, సులోచన ధర్మారెడ్డి, నాయకులు మురళీ మనోహర్ రెడ్డి, భిక్షపతి, బోళ్ల ఆంజనేయులు, కృష్ణ, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి వార్షిక ఉత్సవాలు



కొండపాక, నవంబర్ 24 (జనంసాక్షి): కొండపాక మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎఫ్ డి సి చైర్మన్ బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి వంటేరు ప్రతాపరెడ్డినీ గౌడ సంఘం ఆధ్వర్యంలో సన్మాన నిర్వహించడం జరిగిందని అంబటి బాలచందర్ మాట్లాడుతూ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అనంతుల అశ్వినీ ప్రశాంత్, మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాసపురం సంజీవ రెడ్డి, అంకిరెడ్డిపల్లి సర్పంచ్ గాలి బాలయ్య, దమ్మకపల్లి సర్పంచ్ లగిశెట్టి జ్యోతి బాలస్వామితో పాటు కొండపాక మండల, గ్రామ శాఖ బిఆర్ఎస్ నాయకులు గౌడ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి వేళ ఆలయాల్లో ప్రత్యేక శుభ్రత.. పూజలు



నర్సాపూర్, నవంబర్ 24 (జనంసాక్షి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నర్సాపూర్ పట్టణంలోని శివాలయం, కాల్వగట్టు హనుమాన్ మందిరం, పురాతన లింగమయ్య వద్ద ఉన్న హనుమాన్ మందిరాల్లో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహించి, ఆలయాలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వనముల బుచ్చేష్ యాదవ్ పాల్గొని పూజలు చేశారు. ఆయనతో పాటు 10వ వార్డు కౌన్సిలర్ బుల్లెట్ రాజు, 11వ వార్డు కౌన్సిలర్ మన్నె నిరంజన్ దాస్, 14వ వార్డు కౌన్సిలర్ సరళ ఆంజనేయులు గౌడ్, జిల్లా ఎండోమెంట్ సెల్ జాయింట్ కన్వీనర్ రాజిరెడ్డి, శేఖర్ యాదవ్, రామ్ నీతీష్, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలందరికీ కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. భగవంతుని ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

తప్పిన ప్రమాదం
చెట్టుకు ఢీకొట్టిన డీసీఎం



మల్దకల్, నవంబర్ 24(జనంసాక్షి): జోగులంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండలం శేషంపల్లి గ్రామం వద్ద ఐజ నుండి గద్వాలకు వెళుతున్న డీసీఎం చెట్టుకు ఢీకొనడంతో ఘోర ప్రమాదం తప్పింది. డీసీఎం చెట్లలోకి దూసుకెళ్లి వెనుక భాగంలో డీసీఎం డ్యామేజ్ అయింది. డ్రైవర్ తప్ప ఎవరు లేకపోవడంతో డ్రైవర్ ప్రమాదం నుండి బయటపడాడు.

పేద కుటుంబాలకు
కొండంత అండగా ఇందిరమ్మ బీమా

- **ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి**



నంగునూర్, నవంబర్ 24 (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి కొండంత భరోసానిస్తుందని నంగునూర్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం నంగునూర్ మండల కేంద్రంతో పాటు రాంపూర్, బద్దిపడగ, సిద్ధన్నపేట, నాగరాజుపల్లి గ్రామాలలో జరిగిన బీమా నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 నుండి 59 ఏళ్ల వయస్సు గల అర్హులైన కుటుంబ పెద్దకు ఈ పథకం ద్వారా రూ. 5 లక్షల జీవిత బీమా వర్తిస్తుందని తెలిపారు. లబ్ధిదారులు స్వయంగా దరఖాస్తులపై సంతకాలు చేసి నామినీ వివరాలను అందజేయాలని, అధికారులు ఎలాంటి తప్పులకు తావులేకుండా పారదర్శకంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.